**రాహువు:** ఈ ఏడాది మే 18 వరకు రాహువు మీనంలో ఉంటాడు. తర్వాత ఏడాదంతా కుంభంలో సంచరిస్తాడు.

**కేతువు:** ఈ ఏడాది మే 18 వరకు కేతువు కన్యలో ఉంటాడు. తర్వాత ఏడాదంతా సింహంలో సంచరిస్తాడు.


**గుడి ఉమా మహేశ్వరశర్మ సిద్ధాంతి**
ఎం.ఎస్సీ., నిర్మల్ పంచాంగకర్త
నల్లకుంట, హైదరాబాద్. సెల్: 9885096295
ఈ మెయిల్ : nirmalsiddhanthi@yahoo.co.in




## తుల



(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు)

గురువు సంచారం మే వరకు ప్రతికూల ఫలితాలు ఇస్తుంది. తర్వాత సత్ఫలితాలు పొందుతారు. ప్రతి పనిలోనూ ఆశించిన ఫలితాలు పొందుతారు. ఆదాయం పెరుగుతుంది. రుణ బాధలు తీరుతాయి. కొత్త ఇల్లు కొనుగోలు చేస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. మార్చి నుంచి శని యోగిస్తాడు. రాజకీయంగా పలుకుబడి పెరుగుతుంది. వృత్తిలో పురోభివృద్ధి సాధిస్తారు. వ్యాపారులకు మంచి సమయం. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు విజయవంతం అవుతాయి. కుటుంబంలో సంతోషకరమైన వాతావరణం ఉంటుంది. కొన్ని సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటారు. భూ లావాదేవీల్లో ఆశించిన లాభాలు పొందగలుగుతారు. ఏడాది చివరిలో కేతువు పూర్తి అనుకూల ఫలితాలు ఇస్తాడు. సంతృప్తికరమైన జీవనం గడుపుతారు. సామాజిక సేవలో భాగమవుతారు. విద్యార్థులు శ్రమకు తగిన ఫలితాలు పొందుతారు. ఆరోగ్యపరంగా బాగానే ఉంటుంది. ఏడాది చివరిలో దీర్ఘకాలిక ప్రయోజనం పొందుతారు.
**గురువు, రాహువు కొంత ప్రతికూల ఫలితాలు ఇస్తారు. దత్తాత్రేయస్వామి, దుర్గాదేవి ఆలయాలను తరచూ సందర్శిస్తూ ఉండండి.**

## వృశ్చికం



(విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

ఈ సంవత్సరం మే వరకు గురువు బలంగా ఉంటున్నాడు. ఈ కాలంలో శుభకార్య ప్రయత్నాలు సఫలం అవుతాయి. కుటుంబంలో సంతోషకరమైన వాతావరణం నెలకొని ఉంటుంది. వృత్తివ్యాపారాల్లో అభివృద్ధి ఉంటుంది. తర్వాత అష్టమ గురువు కారణంగా కొన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురవుతాయి. సంవత్సరాంతంలో మళ్లీ శుభ ఫలితాలు పొందుతారు. ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుంది. అన్నిటా విజయాలు వరిస్తాయి. మార్చి చివరి వరకు అర్ధాష్టమ శని ప్రభావం ఉంటుంది. ఫలితంగా జీవనశైలిలో ఒడుదొడుకులు ఉంటాయి. ఆర్థికాంశాల్లో చికాకులు తలెత్తుతాయి. మే తర్వాత శని కొంత మెరుగైన ఫలితాలు ఇస్తాడు. ఆర్థిక సమస్యలు తీరుతాయి. పలుకుబడితో పనులు జరుగుతాయి. ఈ ఏడాది రాహువు వల్ల సమస్యలు ఉత్పన్నం అవుతాయి. శ్రమ పెరుగుతుంది. చేసిన పనికి తగిన గుర్తింపు రాకపోవచ్చు. కేతువు అనుకూలంగా ఉన్నాడు. స్థిరమైన నిర్ణయాల వల్ల లబ్ధి చేకూరుతుంది. ఆరోగ్యం ఉన్నతంగా ఉంటుంది.
**శని, రాహువు కొంత ప్రతికూలంగా ఉన్నారు. ఈ రెండు గ్రహాల అనుకూలత కోసం పరమేశ్వరుడు, అమ్మవారి ఆరాధన చేసుకోగలరు.**

## ధనుస్సు



(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం)

ఏడాది మొదటి ఐదు నెలలు గురు బలం తక్కువగా ఉంది. అయినవారితో వైరం ఏర్పడవచ్చు. అనవసరమైన ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. కార్యభారం వల్ల అలసటకు గురవుతుంటారు. మే తర్వాత పరిస్థితులు పూర్తిగా అనుకూలిస్తాయి. శుభకార్య ప్రయత్నాలు విజయవంతం అవుతాయి. వివాహం, సంతానం, ఉద్యోగం తదితర దీర్ఘకాలిక ప్రయోజనాలు పొందుతారు. మార్చి వరకు శనైశ్చరుడు పూర్తి స్థాయిలో శుభ ఫలితాలు ఇస్తాడు. ఏడాది ప్రారంభంలో శని అనుగ్రహం కారణంగా ఊహించని ఉన్నతమైన మార్పు చోటుచేసుకుంటుంది. ఉద్యోగులకు పదోన్నతి అవకాశం. అనుకూల స్థానచలన సూచన. మార్చి తర్వాత అర్ధాష్టమ శని ప్రభావం మొదలవుతున్నది. శ్రమ ఎక్కువ అవుతుంది. ఆరోగ్యపరంగా స్వల్ప చికాకులు తలెత్తుతాయి. దూర ప్రయాణాల సమయంలో జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. ఏడాది ద్వితీయార్ధం నుంచి రాహువు, కేతువు అనుకూల ఫలితాలు ఇస్తారు. ఆరోగ్యం మెరుగవుతుంది. **గురువు అనుగ్రహం కోసం దత్తాత్రేయస్వామి ఆరాధన చేయండి. అర్ధాష్టమ శని దోష పరిహారం కోసం తరచూ ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించండి.**


## మకరం



(ఉత్తరాషాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు)

ఈ ఏడాది సింహభాగం గురువు మీకు అనుకూలిస్తాడు. అన్నిటినీ మించి ఏల్నాటి శని దోషం ఈ ఏడాది నివృత్తి అవుతున్నది. మీరు పట్టిందల్లా బంగారమనే చెప్పాలి. మార్చి నుంచి ఏడాది పూర్తయ్యే వరకు అన్ని రకాలుగా ఉన్నతమైన ఫలితాలు పొందుతారు. కుటుంబంతో సంతోషంగా కాలం గడుపుతారు. ఉద్యోగులకు మంచి సమయం. మీ ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుంది. మార్చి తర్వాత ఏల్నాటి శని దోషం తొలగిపోతున్నది. అనుకూల స్థాన చలన సూచన. వ్యాపారులు విశేషమైన లాభాలను గడిస్తారు. సోదరులతో సఖ్యత నెలకొంటుంది. ఆస్తి తగాదాలు పరిష్కారం అవుతాయి. ఆరోగ్యం మెరుగవుతుంది. కుటుంబంలో ప్రశాంతత నెలకొంటుంది. ప్రథమార్ధంలో రాహువు, ద్వితీయార్ధంలో కేతువు శుభ ఫలితాలు ఇస్తారు. కోర్టు కేసుల్లో విజయం సాధిస్తారు. విద్యార్థులు శ్రమకు తగిన ఫలితాలు పొందుతారు. హార్డ్‌వేర్ వ్యాపారులకు ఈ ఏడాది కలిసివస్తుంది. ఆరోగ్యం మెరుగవుతుంది. గతంలో నిలిచిపోయిన పనులు ఈ ఏడాది పూర్తవుతాయి. **రాహువు, కేతువు మిశ్రమంగా ఉన్నారు. రాహువు అనుగ్రహం కోసం దుర్గాదేవి సేవ, కేతువు అనుకూలత కోసం సుబ్రహ్మణ్యస్వామి సేవ చేసుకోండి.**

## కుంభం



(ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు)

ఈ ఏడాది గురువు సింహభాగం మీకు శుభ ఫలితాలు ఇస్తాడు. ప్రథమార్ధం కన్నా ద్వితీయార్ధంలో ఎక్కువగా రాణిస్తారు. ఆర్థికంగా విశేషమైన విజయాలు సాధిస్తారు. ఆస్తుల ద్వారా ఆదాయం సమకూరుతుంది. ఇంట్లో శుభకార్యాలు జరుగుతాయి. ఏల్నాటి శని చివరి దశకు చేరుకున్నారు. మంచి మార్పులు మొదలవుతాయి. వ్యాపారం దినదినాభివృద్ధి చెందుతుంది. పాత బాకీలు వసూలు అవుతాయి. అనవసరమైన విషయాలకు అంతగా ప్రాధాన్యం ఇవ్వకండి. పెట్టుబడుల విషయంలో ఒకటికి రెండుసార్లు ఆలోచించడం అవసరం. బంధుమిత్రులతో సఖ్యత నెలకొంటుంది. కుటుంబంలో సందడి వాతావరణం ఉంటుంది. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. ఏడాది ప్రథమార్ధంలో కిందిస్థాయి ఉద్యోగులతో చికాకులు తలెత్తవచ్చు. సంయమనం పాటించడం చాలా అవసరం. రాహువు, కేతువు అంతగా యోగించే స్థానాల్లో లేరు. భూ లావాదేవీల్లో మిశ్రమంగా ఉంటుంది. ఆరోగ్యపరంగా జాగ్రత్తలు తీసుకోవడం అవసరం.
**రాహువు అనుగ్రహం కోసం దుర్గాదేవి ఆరాధన, కేతువు అనుకూలత కోసం నరసింహస్వామి సేవ చేసుకోగలరు.**

## మీనం



(పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి)

ఈ సంవత్సరం మంచి-చెడు మిశ్రమంగా ఉంటుంది. సంవత్సరం మధ్యలో గురువు అనుకూల ఫలితాలు ఇస్తాడు. మొదట్లో, చివర్లో కొన్ని చికాకులు కలిగిస్తాడు. అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలం అత్యంత అనుకూలంగా చెప్పవచ్చు. ఈ సమయంలో గురువు మీకు పూర్తిస్థాయిలో యోగిస్తాడు. ఆదాయం పెరుగుతుంది. సమాజంలో ఉన్నతమైన స్థాయికి చేరుకుంటారు. గృహ యోగం ఉంది. సంతాన విషయంలో శుభవార్త వింటారు. చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తవుతాయి. ఏల్నాటి శని ప్రభావం ఉంది. ఫలితంగా ఆర్థికంగా, ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. సేవకుల వల్ల నష్టం జరగవచ్చు. బంధువర్గంతో ఆచితూచి వ్యవహరించడం అవసరం. రాజకీయ, కోర్టు వ్యవహారాల్లో ఆశించినంత పురోగతి ఉండకపోవచ్చు. మే వరకు రాహువు రాశిలో, కేతువు ఏడింట్లో ఉండటం వల్ల చికాకులు ఉంటాయి. తర్వాత కేతువు అనుకూలంగా మారుతున్నాడు. ఆర్థిక సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం అవుతాయి. నిత్యం హనుమాన్ చాలీసా పఠించండి. తరచూ ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించండి.